క్లుప్తంగా

యోగా శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోండి



యోగాసనం వేస్తున్న శిక్షకులు

మందమర్రిరూరల్: పట్టణంలోని మున్సిపల్ ఆఫీస్ ఆవరణలో ఆయుష్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత యోగా శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని మున్సినల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. నూతనంగా కేటాయించబడిన యోగా శిక్షకులతో సోమవారం తరగతులను ప్రారంభించారు. ఉదయం 6గంటల నుంచి 7గంటల వరకు యోగా శిక్షకులు రామ్మోహన్, సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు శిక్షకురాలు శైలజ ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమానికి పలువురు యోగా శిక్షకులు హాజరై యోగా విన్యాసాలు చేశారు. కార్యక్రమంలో కొంపెల్లి రమేష్, బర్ల సదానందం, రజిత తదితరులు ఉన్నారు.

మామిడిగూడెంలో 'కార్డన్ సెర్చ్'



మాట్లాడుతున్న సీఐ శశిధర్‌రెడ్డి

కాసిపేట: మండలంలోని కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధి మామిడిగూడెంలో సోమవారం తెల్లవారుజామున కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం(కార్డన్ సెర్చ్) నిర్వహించారు. ఎవరైనా అనుమానిత వ్యక్తులు ఉంటున్నారా, అపరిచిత వ్యక్తులకు ఎవరైనా షెల్టర్ ఇస్తున్నారా అని మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఆధార్‌కార్డు, గుర్తింపుకార్డులు, ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్ల ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్‌లు పరిశీలించారు. సక్రమంగా లేని 39ద్విచక్ర వాహనాలకు జరిమానా విధించారు. నార్కోటిక్ డాగ్‌స్క్వాడ్‌తో ఇళ్లను తనిఖీ చేశారు. సైబర్ క్రైం, గంజాయి నియంత్రణ, సీసీ కెమెరాల ప్రాముఖ్యత, ట్రాఫిక్ రూల్స్, కొత్త చట్టాలు, మూఢ నమ్మకాలపై అవగహన కల్పించారు. కార్యక్రమంలో కాసిపేట, దేవాపూర్, రామకృష్ణపూర్ ఎస్సైలు ప్రవీణ్ కుమార్, ఆంజనేయులు, రాజశేఖర్, పోలీస్ సిబ్బంది, నార్కోటిక్ డాగ్ సిబ్బంది తదితరులున్నారు.

గూడెంలో భక్తుల పూజలు



సత్యదేవున్ని దర్శించుకుంటున్న భక్తులు

దండెపల్లి: కార్తిక మాసం సందర్భంగా మండలంలోని గూడెం సత్యనారాయణ స్వామి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. 408మంది జంటలు సత్య నారాయణ స్వామి వ్రతం ఆచరించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కోలహాలంగా మారింది. ఆలయ అధికారులు భక్తులకు సౌకర్యాలు కల్పించారు.

ఎమ్మెల్యే వివేక్ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న యజమానులు

రామకృష్ణాపూర్: స్థానిక గద్దెరాగిడి శ్రీనివాసగార్డెన్స్ వద్ద ట్రాక్టర్ యజమానులు సోమవారం చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. గోదావరి ఇసుకను సరఫరా చేసేందుకు మందమర్రి మండల పరిధిలోని ట్రాక్టర్లకు ఆన్‌లైన్ అనుమతులు ఇప్పించేందుకు ఎమ్మెల్యే కృషి చేసినందుకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల ట్రాక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు పోలం సత్యం, చిప్పరి శ్రీనివాస్, సంతోష్, సందీప్ పాల్గొన్నారు.

'ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకించండి'

పాతమంచిర్యాల: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడారు. నిరుద్యోగం, అధిక ధరలు, అసమానతలతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో మంగళవారం నిర్వహించే నిరసన ప్రదర్శనకు అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు.

ఉద్యాన నర్సరీ వెలవెల

ఒకప్పుడు మొక్కలు, తోటలతో కళకళలాడిన భీమారంలోని ఉద్యాన నర్సరీ, రైతు శిక్షణ కేంద్రం నేడు వెలవెలబోతోంది. ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్ట్ పరిధిలోని భీమారంలో 17 ఎకరాల్లో 1985 సంవత్సరంలో ప్రభుత్వం ప్రారంభించింది. ఈ ప్రాంతంలో గిరిజన కుటుంబాలు అధికంగా ఉండటంతో వారికి పండ్లతోటల పెంపకంతో పాటు మొక్కల తయారీపై శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా భీమారం, వేమనపల్లి, నెన్నెల, కోటపల్లి, చెన్నూరు మండలాల్లోని గిరిజన యువతకు మామిడి మొక్కలు అంటు కట్టడంపై శిక్షణ ఇచ్చారు. అనంతరం పెద్ద ఎత్తున మామిడి మొక్కలను ఉత్పత్తి చేసి అప్పటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు సరఫరా చేశారు. భీమారం



భీమారంలోని ఉద్యాన నర్సరీ, రైతు శిక్షణ కేంద్రం

- భీమారం ఉద్యాన నర్సరీ, రైతు శిక్షణ కేంద్రంపై చిన్నచూపు
- పిచ్చిమొక్కలతో అధ్వానంగా పండ్ల తోటలు
- పట్టించుకోని ఐటీడీఏ అధికారులు
- మూసివేత దిశగా అడుగులు

కూలుతున్న భవనాలు

నర్సరీల్లో సిబ్బంది నివసించే గృహాలతో పాటు మందులు నిల్వ ఉంచేందుకు పెద్ద ఎత్తున భవనాలు నిర్మించారు. అయితే వాటిని నిర్మించి దాదాపు 30ఏళ్లు కావస్తుండడంతో నేడు అవి శిథిలావస్థకు చేరుకుని కూలిపోతున్నాయి.



కూలిన గోదాం

పేరుగాంచిన నర్సరీ..

ఉమ్మడి రాష్ట్రంలోనే మామిడి అంటుమొక్కలకు భీమారం నర్సరీ పేరుగాంచింది. ఇక్కడి మొక్కలు నాణ్యతతో ఉంటాయనే నమ్మకంతో వివిధ జిల్లాల నుంచి ఇక్కడకు వచ్చి కొనుగోలు చేసేవారు. ప్రభుత్వం కూడా తోటల పెంపకం కోసం ఇక్కడి మొక్కలనే పంపిణీ చేసేది. కానీ పదేళ్లుగా ఐటీడీఏ అధికారులు నర్సరీపై శ్రద్ధ చూపడంలేదు. గతంలో దాదాపు 50మంది గిరిజన కూలీలు నర్సరీలో పనిచేసి ఉపాధి పొందారు. నేడు ఆ సంఖ్య ఒకటికి చేరింది.

పర్యాటకులకు నిలయం

భీమారంలోని ఐటీడీఏ నర్సరీల్లో వివిధ రకాల పండ్ల మొక్కలు, పూలతోటలతో పచ్చదనానికి పట్టుకొమ్మలా ఉండేది. మంచిర్యాల, శ్రీరాంపూర్, బెల్లంపల్లి, మందమర్రి, గోదావరిఖని, రామకృష్ణాపూర్, చెన్నూర్, తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు వచ్చి ఇక్కడ సేదతీరేవారు. నేడు కళావిహీనంగా మారడంతో పర్యాటకులు రావడం మానేశారు.

ఎందుకు ఈ నిర్లక్ష్యం?

పండ్ల తోటల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఒకవైపు ప్రభుత్వం ప్రకటించుకుంటున్నప్పటికీ ఇక్కడ మాత్రం ఉన్న తోటలు, శిక్షణ కేంద్రం గురించి పట్టించుకోవడంలేదు. 17 ఎకరాల స్థలంలో వివిధ రకాల తోటలు ఉన్నాయి. వీటిని అభివృద్ధి చేస్తే ఈ ప్రాంత గిరిజనులకు ఉపాధి లభిస్తుందని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు చేపట్టి భీమారం నర్సరీకి పూర్వ వైభవం తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

పండ్ల తోటల్లో పిచ్చి మొక్కలు

నర్సరీలో గల మామిడి, సపోట తోటల్లో పిచ్చి మొక్కలు పెరిగి అందవికారంగా మారాయి. ఏటా మామిడి తోటలను వేలం వేసి లక్షల రూపాయలు ఆర్జించిన ఐటీడీఏ నేడు వాటి గురించి పట్టించుకోకపోవడంతో ఆదాయానికి గండిపడింది.



మామిడితోటలతో పెరిగిన పిచ్చిమొక్కలు

ప్రతిపాదనలు పంపించాం



భీమారంలోని నర్సరీ అభివృద్ధికోసం రూ.1.20 కోట్లతో పనులు చేపట్టేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపట్టి నర్సరీకి పూర్వవైభవం తీసుకొస్తాం. ప్రస్తుతం నర్సరీలో కొద్దిమొత్తంలో మామిడి మొక్కలు పెంచుతున్నాం. – సందీప్, ప్రాజెక్ట్ హార్టికల్చర్ అధికారి(పీహెచ్‌వో), ఉట్నూర్

ప్రజల ఆర్థిక పరిపుష్టిలో బ్యాంకులు కీలకం

- కలెక్టర్ కుమార్‌దీపక్

నస్పూర్: ప్రజల ఆర్థిక పరిపుష్టిలో బ్యాంకుల పాత్ర కీలకమని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. సీసీసీ కార్నర్ వద్ద ది గాయత్రి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకును కలెక్టర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు బ్యాంకుల్లో ఖాతాలు తెరిచి లావాదేవీలను నిర్వహించుకోవడం ద్వారా ఆర్థిక క్రమశిక్షణతో పాటు కుటుంబాల ఆర్థిక స్థితిగతులు మెరుగవుతాయని పేర్కొన్నారు. నేటి సమాజంలో డిజిటల్ లావాదేవీలు దేశఆర్థిక పురోభివృద్ధికి దోహదం చేస్తున్నాయని తెలిపారు.



బ్యాంకును ప్రారంభిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి సంజీవ రెడ్డి, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ తిరుపతి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్' పోస్టర్ ఆవిష్కరణ

రామకృష్ణాపూర్: వచ్చే నెల డిసెంబర్ 1న హైదరాబాద్‌లో తలపెట్టనున్న మాలల సింహగర్జన కార్యక్రమం పోస్టర్‌ను సోమవారం స్థానిక రాజీవ్ చౌక్‌లో మాల కులస్తులు ఆవిష్కరించారు. మాలలంతా ఏకమై ఇంటింటికీ ఒకరు చొప్పున విచ్చేసి సింహగర్జనను విజయవంతం చేయాలని, మాలల ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాల సంఘం జిల్లా కన్వీనర్ తొగరు సుధాకర్, కో కన్వీనర్ పలిగిరి కనకరాజు, నల్లాల మురళి, సుధీర్, మొగిలయ్య తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట: మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మాలల సింహగర్జన పోస్టర్లను మాలల జేఏసీ కన్వీనర్ తొగరి సుధాకర్ ఆధ్వర్యంలో సోమవారం ఆవిష్కరించారు. డిసెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించే 'మాలల సింహగర్జన' బహిరంగ సభకు అధిక సంఖ్యలో మాలలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కో



రామకృష్ణాపూర్: పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కన్వీనర్లు జూపాక సుధీర్, దాసరి వెంకటరమణ, గజెల్లి లక్ష్మణ్, కుంబాల రాజేష్, కూన రవికుమార్, పొట్ట మధుకర్, పలిగిరి కనకరాజు, భూపెల్లి మల్లేష్, బొజ్జ శరత్, మండల రవికుమార్, భైరం ప్రభాకర్, మండలాధ్యక్షుడు మేడ సమ్మయ్య, బన్న లక్ష్మణ్‌దాస్, మేడ రాజన్న, బన్న భీమయ్య, బొడ్డు రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై కళాజాత

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని రంగంపేట్, దొరగారిపల్లి, రాజీవ్‌నగర్ కాలనీల్లో సోమవారం తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుల బృందం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు అందిస్తున్న విధానంపై ఆటపాటల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారులు ముల్కల్ల మురళి, వెల్తురు పోశం, పడకపురం రవికుమార్, కొప్పర్తి రవీందర్, సత్యనారాయణ, బీర్పూర్ శ్రీనివాస్, లింగంపల్లి రాజేశ్, చేగొండ నిరోషా పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి-సంక్షేమ పథకాలపై రాష్ట్ర సాంస్కృతిక సారధి కళాకారులు సోమవారం హాజీపూర్ మండలంలోని దొనబండ, సబ్బెపల్లి



కళాజాత నిర్వహిస్తున్న కళాకారులు

గ్రామాల్లో ఆటాపాటల ద్వారా అవగాహన కల్పించారు. కళాకారులు లావుడ్యా రమేశ్, మామిళ్ల లచ్చన్న, గొడిసెల కృష్ణ, సల్లూరి కృష్ణ, రాంటెంకి రాజాతిరుపతి, వావిలాల నాగలక్ష్మి, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలి

పాతమంచిర్యాల: భారత రాజ్యాంగ రూపకల్పన ప్రాముఖ్యతను ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేయాలని సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్ అధ్యక్షుడు అడ్వకేట్ మోతే రాజలింగు అన్నారు. జిల్లా కేంద్రంలో నవంబర్ 26న నిర్వహించే భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవంపై సోమవారం ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగం 299మంది సభ్యులతో కూడిన కమిటీ ఏర్పాటు చేయగా అందులో 15మంది మహిళలకు చోటు కల్పించడం విశేషం అన్నారు. నేటి యువత భారత రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్ నాయకులు మారపాక మల్లేష్, ఆడెపు సురేందర్, నడిపెల్లి సునిల్‌రావు, హనుమాండ్ల రమేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మోతే రాజలింగు

మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ



భీమారం: మండల కేంద్రంలోని ఆరెపల్లి క్రాస్ రోడ్డు వద్ద నెలరోజులుగా మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకై నీళ్లు రోడ్డు పాలవుతున్నాయి. వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం సంబంధిత అధికారులకు విన్నవించినా ఏమాత్రం పట్టించుకోవడంలేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకొని లీకేజీ అరికట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నేడు రాజకీయ పార్టీల సమావేశం

కాసిపేట: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం 2వ విడత సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకొని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సత్యనారాయణసింగ్ సోమవారం తెలిపారు. గ్రామ పంచాయతీల వారీగా సప్లిమెంటరీ ఓటరు జాబితా పై ఉదయం 11.30గంటలకు నిర్వహించు సమీక్ష సమావేశానికి మండల రాజకీయ పార్టీల అధ్యక్షులు హాజరు కావాల్సిందిగా కోరారు.

'ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రద్దు చేయాలి'

శ్రీరాంపూర్: బీసీలకు నష్టదాయకంగా మారిన అగ్రవర్ణ ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు వెంటనే రద్దు చేయాలని సింగరేణి బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం, బీసీ ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఆ సంఘాల నాయకులు నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. కులగణన పూర్తిచేసి రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు పెంచాలన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కులగణన వెంటనే చేపట్టాలన్నారు. తెలంగాణలో బీసీల సంస్కృతి, సాంప్రదాయాలు, కులవృత్తులను కాపాడాలన్నారు. ఈ నెల 30న మంచిర్యాలలోని జాఫర్‌నగర్ హెచ్‌డీ ఫంక్షన్ హాల్లో బీసీ ఐక్య సదస్సు జరగనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు పలువురు వక్తలు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. సింగరేణి కార్మిక వర్గం పెద్ద ఎత్తున ఈ కార్యక్రమానికి తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు వడ్డేపల్లి మనోహర్, కన్వీనర్ రంగు మల్లేష్, సింగరేణి బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు పెట్టం లక్ష్మణ్, బద్రి బుచ్చయ్య, పానుగంటి సత్తయ్య, గోపతి మల్లేష్, మహేందర్, నీలం సదయ్య, వెంగళ కుమారస్వామి పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

'చలో కొత్తగూడెం' విజయవంతం చేయండి

శ్రీరాంపూర్/మందమర్రిరూరల్: సులబ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27న 'చలో కొత్తగూడెం' హెడ్ ఆఫీస్‌ను ముట్టడించనున్నట్లు సింగరేణి సులబ్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షులు బ్రహ్మానందం ,ఐఎఫ్‌టీయూ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి ఎండీ జాఫర్ తెలిపారు. కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. శ్రీరాంపూర్‌లోని ఆ యూనియన్ కార్యాలయంలో, మందమర్రి పట్టణంలోని ఐఎఫ్‌టీయూ ఆఫీస్‌లో సోమవారం సమావేశాలు నిర్వహించి మాట్లాడారు. సింగరేణిలో పనిచేస్తున్న సులబ్ కార్మికులకు యాజమాన్యం సదుపాయాలు, హక్కులను కల్పించకుండా పనిభారం మోపుతుందన్నారు. కార్మికులకు ఈఎస్‌ఐ, ఈపీఎఫ్, బోనస్, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశాల్లో యూనియన్ నాయకులు నర్సయ్య, మంతెన లక్ష్మయ్య, రాజేందర్, సదానందం, సుగుణ, దివ్య, మహేశ్వరి, సునీత, కనుకయ్య, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్‌తో విద్యార్థులకు క్రమశిక్షణ

మందమర్రిరూరల్: స్కౌట్ ద్వారా విద్యార్థులకు క్రమశిక్షణ అలవడుతుందని, దేశభక్తి పెరగడంతో పాటు జీవితంలో మంచి పౌరులుగా జీవిస్తారని ఏరియా జీఎం దేవేందర్ అన్నారు. మందమర్రి ఏరియాలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో సోమవారం స్టాండర్డ్ జడ్జింగ్ క్యాంపు స్కౌట్ అండ్ గైడ్స్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జీఎం హాజరై మాట్లాడారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమానికి గోదావరిఖని, శ్రీరాంపూర్, గోలేటి, మందమర్రి ఏరియాల నుంచి సుమారు 65మంది విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీఎం దేవేందర్

బొగ్గుబాయి వార్తలు

బీసీ ఉద్యోగుల కమిటీ ఏర్పాటు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని పలు గనుల్లో సింగరేణి కాలరీస్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కమిటీలను ఎన్నుకున్నారు. సోమవారం ఆయా గనులపై జరిగిన ముఖ్య నాయకులు పాల్గొని కమిటీలను ఎన్నుకున్నారు. ఇందారం ఓసీపీ కన్వీనర్‌గా పెట్టం శ్రీనివాస్, కో కన్వీనర్‌గా సిలివేరి సంపత్, ఐకే 1ఏ గని కన్వీనర్‌గా దిడ్డి రమేశ్, కో కన్వీనర్‌గా ఈర్ల సతీశ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు బద్రి బుచ్చయ్య, బరుపటి మారుతి, గోళ్ల మహేందర్, శ్రీకాంత్, పంచెర్పుల నరేశ్, భూషణ్‌లు పాల్గొన్నారు.

'కొత్త గనుల ఏర్పాటుకు కృషి'

శ్రీరాంపూర్: సింగరేణిలో కొత్త గనులు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని పట్టబద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి తెలిపారు. ఇందారం చౌరస్తా నుంచి ఆర్కే న్యూటెక్ గని వరకు సోమవారం ఆయన బైక్ ర్యాలీ నిర్వహించి అనంతరం కార్మికులతో మాట్లాడారు. వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులైన కార్మికులు తనకు మొదటిప్రాధాన్యత ఓటేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల సంఘం (ట్రస్మా) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెత్తుల రాజేంద్రపాణి, జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రేగళ్ల ఉపేందర్, ఆల్ఫోర్స్ విద్యా సంస్థల జోనల్ ఇన్‌చార్జీ శ్రీనివాస్, ప్రైవేట్ పాఠశాలల సంఘం నాయకులు కృష్ణారెడ్డి, మైదం రామకృష్ణ, ఊట్ల సత్యనారాయణ, అంబాల రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

గర్మీకోట్లు పంపిణీ చేయాలి

శ్రీరాంపూర్: సింగరేణిలో సర్ఫేస్ డిపార్టుమెంట్‌లలో పనిచేస్తున్న కార్మికులకు, కాంట్రాక్ట్ కార్మికులకు కంపెనీ గర్మీకోట్లను(స్వెటర్లు) పంపిణీ చేయాలని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, కేంద్ర కమిటీ నాయకులు బండి రమేష్, పానుగంటి సత్తయ్య, పొగాకు రమేష్ సోమవారం ఒక ప్రకటనలో యాజమాన్యంను డిమాండ్ చేశారు.

సంక్షిప్త వార్తలు

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

వేమనపల్లి: మండలంలోని జిల్లెడ, దస్నాపూర్, సూరారం, నాగారం , మంగెనపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో మాజీ జెడ్పీటీసీ సంతోష్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ కుబిడె వెంకటేషం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సాబీర్‌ఆలీ, మాజీ వైస్ ఎంపీపీ గణపతి, మాజీ సర్పంచ్‌లు మధుకర్ గౌడ్, గాలి మధు, నికాడి భగవంతు, పీఏసీఎస్ సీఈఓ మధుకర్‌లు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కార్యాలయం ప్రారంభం

దండేపల్లి: మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ కార్యాలయాన్ని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు బాపన్న, ఆలిండియా అంబేద్కర్ సంఘం జిల్లా కన్వీనర్ రవికుమార్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మంతెన నవీన్ పాల్గొన్నారు.

గణిత ఫోరం నూతన కార్యవర్గం

జన్నారం: మండల ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల గణిత ఫోరం నూతన కార్యవర్గాన్ని సోమవారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కందుల తిరుపతి, అధ్యక్షుడిగా సదానందం, ప్రధాన కార్యదర్శిగా ముత్తే తిరుపతి, ఉపాధ్యక్షులుగా రజితరాణి, అంజన్న, కోశాధికారిగా గోవర్ధన చారి, కార్యదర్శిగా దేవ్‌సింగ్, సలహాదారులుగా విద్యాసాగర్, విజయ్‌కాంత్, జాడి రాజన్న ఎన్నికయ్యారు.

నియామకం

తాండూర్: మండల బీఆర్ఎస్వీ అధ్యక్షుడిగా శ్రీకాంత్ డోంగ్రేను సోమవారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడికి బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్ నియామక పత్రం అందజేశారు.

పాఠశాల ప్రహరీలకు భూమిపూజ

భీమిని: మండలంలోని వెంకటాపూర్, రాంపూర్, వడాల, లక్ష్మీపూర్, పాఠశాలల ప్రహరీలకు సోమవారం మండల పార్టీ అధ్యక్షుడు గాదం లక్ష్మీనారాయణ, బెల్లంపల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నర్సింగరావుతో కలిసి భూమిపూజ చేశారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

తాండూర్: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్, కార్యకర్తలు చిన్నారులను ఒడిలో కూర్చోబెట్టుకుని అక్షరాలు దిద్దించారు.